క్లుప్తంగా

రేపటి నుంచి ధార్మిక కార్యక్రమాలు

రాజంపేట టౌన్ : పట్టణంలోని ఎర్రబల్లి కోదండ రామాలయంలో మంగళవారం నుంచి ఐదు రోజులపాటు తిరుమల – తిరుపతి దేవస్థానం హిందూ ధర్మప్రచార పరిషత్ అన్నమయ్య జిల్లాశాఖ ఆధ్వర్యంలో ధార్మిక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు జిల్లా ప్రోగ్రాం అసిస్టెంట్ గోపిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిరోజు సాయంత్రం 6:30 గంటల నుంచి ధార్మిక కార్యక్రమాలు ప్రారంభమవుతాయని చెప్పారు. ఈనెల 24న రామాయణం, 25న మహాభారతం, 26న భగవద్గీతపై ధర్మాచార్యులు గంగసపల్లె వెంకటరమణ ధార్మికోపన్యాసం చేస్తారన్నారు. 27వ తేదీ ఉదయం స్థానిక మహిళలచే అమ్మవారికి కుంకుమార్చన, రాత్రి హిందూ ధర్మప్రచార పరిషత్ కళాకారులచే హరికథ, 28న భజన, నగర సంకీర్తన కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో ప్రజలు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని గోపిబాబు కోరారు.

శభాష్.. పోలీస్!



చిన్నఓరంపాడు వద్ద కంకరతో గుంతలను పూడ్పిస్తున్న ఎస్ఐ మహేష్

ఓబులవారిపల్లె : జాతీయ రహదారిపై పెద్ద పెద్ద గుంతలు పడి తరచూ వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రభుత్వ పాలకులు, నాయకులు ప్రతిరోజూ చూస్తూ కూడా పట్టించుకోలేదు. ఓబులవారిపల్లె ఎస్ఐ పి.మహేష్ ఆదివారం జాతీయ రహదారిపై ఉన్న గుంతలలో కంకర వేయించి తన సేవా దాతృత్వాన్ని ప్రదర్శించారు. ప్రభుత్వం, పాలకులు పట్టించుకోకపోయినా ఎస్ఐ స్పందించి జాతీయ రహదారిపై గుంతలను పూడ్చడంపై మండల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

పాదయాత్రకు సంఘీభావం



పాదయాత్రకు సంఘీభావం తెలుపుతున్న బీజేపీ నాయకులు

ఓబులవారిపల్లె : కొర్లకుంట ఉప సర్పంచ్, బీజేపీ నాయకులు ముక్కా రూపేష్ కుమార్ రెడ్డి అన్నమయ్య కాలిబాట మార్గం గుండా తిరుమల పాదయాత్రకు ఆదివారం ఉదయం కొర్లకుంట గ్రామం నుంచి ప్రారంభించారు. దాదాపు 100 మంది గోవింద మాలధారులు పాదయాత్రలో భాగస్వాములయ్యారు. కొర్లకుంట గ్రామం వద్ద బీజేపీ నాయకులు సాయి లోకేష్, పులపుత్తూరి రామసుబ్బారెడ్డిలు పాదయాత్రలో పాల్గొని సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ కమిటీ మాజీ అధ్యక్షులు నందలూరు వెంకట సుబ్బారెడ్డి, నాయకులు గడ్డం చెంగల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ గణిత దినోత్సవం



శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న విద్యార్థులు

పుల్లంపేట : మండల పరిధిలోని దళవాయిపల్లి ప్రాథమిక పాఠశాలలో ఆదివారం గణిత దినోత్సవ వేడుకలు ఉపాధ్యాయుడు రమణ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. గణిత దినోత్సవాన్ని పురస్కరించుకొని వ్యాసరచన, చిత్రలేఖన, ప్రాజెక్టు వర్క్ మీద పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు స్ట్రాలతో చేసిన కోణాలు, భిన్నాలు, అగ్గిపుల్లలతో చేసిన గణిత గుర్తులు, ఆకారాలతో చేసిన గణిత రోబో ప్రాజెక్టులు అందరినీ అలరించాయి. అనంతరం ఉపాధ్యాయుడు రమణ గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ సేవలు గురించి కొనియాడారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

ఎడ్యుకేషన్ కాంప్లెక్స్‌లను ఏర్పాటు చేయాలి

కడప ఎడ్యుకేషన్ : రాష్ట్రంలో స్కూల్ కాంప్లెక్స్‌ల పునర్వ్యవస్థీకరణలో భాగంగా స్కూల్ కం ఎడ్యుకేషన్ కాంప్లెక్స్‌లు ఏర్పాటు చేయాలని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు సీవీ ప్రసాద్ డిమాండ్ చేశారు. కడప ఎన్జీవో భవనంలో ఏపీటీఎఫ్ అమరావతి ముఖ్య కార్యకర్తల సమావేశం ఆదివారం జరిగింది. ప్రసాద్ మాట్లాడుతూ అన్ని సౌకర్యాలు ఉన్న ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను జూనియర్ కాలేజీకి లింక్ అప్ చేయాలని డిమాండ్ చేశారు. విద్య, ల్యాబ్, ఆటస్థలం, ఇతర సౌకర్యాలు ఉన్న చోటే స్కూల్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయాలని కోరారు. విద్యాశాఖ ప్రకటించిన ఏ,బి స్కూల్ కాంప్లెక్స్‌ల మధ్య గల తేడాలు వివరించి, అభ్యంతరాల స్వీకరణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. కడప జిల్లా ప్రధాన కార్యదర్శి అలీఖాన్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని కాంప్లెక్స్‌లను కొనసాగించాలని, కాంప్లెక్స్‌ల మధ్య దూరం కనీసం ఐదు కిలోమీటర్లు ఉండేలా చూడాలని కోరారు. ఈ సమావేశంలో ఉమాకాంత్, చంద్ర, పద్మజ పాల్గొన్నారు.

పనులు వీక్ .. పబ్లిసిటీ పీక్



నవంబర్ 28న సాలాబాద్ క్రాస్ రోడ్డు వద్ద రోడ్డుపై ఏర్పడిన గుంతలను పూడ్చుతున్న రాష్ట్ర మంత్రి బిసి జనార్దన్‌రెడ్డి (ఫైల్)

పనులు వీక్ ఉన్నప్పుడే పబ్లిసిటీ పీక్స్‌లో ఉండాలని ఓ సినిమాలో ఎంఎస్ నారాయణ చెప్పిన డైలాగ్ అందరికీ గుర్తుండే ఉంటుంది. ఆ డైలాగ్‌ను కూటమి ప్రభుత్వం సీరియస్ తీసుకుని పాటించింది కూడా. కూటమి ప్రభుత్వం గ్రామీణుల రోడ్లను బాగుచేస్తామని చెప్పి 'గుంతల రహిత రోడ్లు' కార్యక్రమాన్ని గత నెలలో చేపట్టింది. ఇందులో భాగంగా నవంబర్ 28న రాష్ట్ర రోడ్డు, భవనాల శాఖ మంత్రి బి.సి.జనార్దన్‌రెడ్డి స్వయంగా విచ్చేసి ఒంటిమిట్ట మండలంలోని సాలాబాద్ క్రాస్ వద్ద తారపోసి గుంతను పూడ్చే కార్యక్రమం చేపట్టారు. ప్రభుత్వం గ్రామీణ రోడ్లకు ప్రాధాన్యతనిస్తుందంటూ ప్రగల్భాలు పలికారు. తీరా చూస్తే నెల రోజులు గడువకముందే మంత్రి ఎక్కడైతే రోడ్డుకు మరమ్మతులు చేసి వెళ్లారో అక్కడే మునుపటికంటే పెద్ద గుంతలు ఏర్పడటమే కాకుండా అందులో నీరు నిలిచి వాహనదారుల నడుములను గుల్లా చేసేలా పరిస్థితి తయారైంది. కూటమి ప్రభుత్వం రోడ్ల మరమ్మతు పేరుతో చేస్తున్న పనుల్లోని డొల్లతనాన్ని స్థానికులు చూసి ఎద్దేవా చేస్తున్నారు. సంక్రాంతిలోపు గుంతలు లేని రోడ్లు చేస్తామని గొప్పలు చెప్పిన ప్రభుత్వ తీరుపై వాహనదారులు విమర్శలు గుప్పిస్తున్నారు. పబ్లిసిటీ పైన ఉన్న యావ కాసింత నాణ్యమైన పనులు చేపట్టడంలోనూ చూపాలంటూ కూటమి ప్రభుత్వ నాయకులకు, అధికారులకు సూచనలు చేస్తున్నారు.

– ఒంటిమిట్ట



మంత్రి జనార్దన్‌రెడ్డి పూడ్చిన గుంతలలో నెల తిరగక ముందే మళ్లీ ఏర్పడ్డ గుంతలో నిలిచిన నీరు

ప్రాధేయపడుతున్నా పట్టించుకోరే!

- చినుకుపడితే అడుగు బయటపెట్టలేకున్నామంటున్న మనోరంజన్ నగర్ వాసులు
- తమ వీధిలో రోడ్డు వేయాలంటూ అధికారులకు విజ్ఞప్తి



మనోరంజన్ నగర్‌లో సీసీరోడ్డు లేక బురదమయమైన మార్గం

నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని అరవపల్లిలో ఉన్న మనోరంజన్ నగర్‌లో చిన్నపాటి వర్షం కురిసినా రోడ్డుపై అడుగుపెట్టలేకపోతున్నామని కాలనీ వాసి దేవగిరి సుబ్బనరసయ్య, వీధిలోని మరికొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము ఎప్పటికప్పుడు పన్నులు చెల్లిస్తున్నా.. కాలనీలో మౌలిక వసతుల కల్పన కలగానే మిగిలిందన్నారు. గత రెండు సంవత్సరాల నుంచి తమకు సీసీ రోడ్లు వేయమని ఎంపీడీఓ కార్యాలయం, పంచాయతీ కార్యాలయం చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. లేని రోడ్లకు బిల్లులు వేస్తున్న అధికారులు రోడ్డు వేయడాన్ని మరిచారని ఎద్దేవా చేశారు. ఇప్పుడు వేస్తాం.. అప్పుడు వేస్తాం అని కాలయాపన చేస్తున్నారే తప్ప సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవడం లేదంటూ ఆరోపించారు. తాముండగా మా వీధిలో రోడ్డు వేస్తారో లేదోననే భావనను స్థానికులు తెలియజేస్తున్నారు. ఒక రోడ్డు వేయాలని కోరుతున్నా పట్టించుకోని పంచాయతీ అధికారుల నిర్లక్ష్యాన్ని ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులకు తీసుకెళ్తామని ఈ సందర్భంగా అక్కడి వారు చెప్పారు. రోడ్లు లేని చోట రోడ్డును వేయాలి కానీ ఉన్న చోట వేసి బిల్లులు చేసుకోవడాన్ని స్థానికులు తప్పుబట్టారు. ఇప్పటికైనా అధికారులు, పంచాయతీ ప్రతినిధులు స్పందించి రోడ్డు నిర్మాణం చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

కాల్పుల మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా నేతలు

రాయచోటి అర్బన్ : రాయచోటి రూరల్ మండలం మాధవరం గ్రామంలో గుర్తుతెలియని దుండగులు జరిపిన తుపాకీ కాల్పులలో మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని రకాలుగా ఆదుకోవాలని సీపీఐ నేతలు సాంబశివ, విశ్వనాథనాయక్, సుధీర్ కుమార్, ఎస్.శ్రీనివాసులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో వారు విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ రాయచోటి ప్రాంతంలో పల్లె పల్లె తిరుగుతూ చిక్కు వెంట్రుకలకు పాత సామాన్లు విక్రయిస్తూ జీవించే పేదలైన హనుమంతు, రమణలపై గుర్తుతెలియని వ్యక్తులు కాల్పులు జరపడం దురదృష్టకరం అన్నారు. కాల్పుల్లో మృతి చెందిన హనుమంతు కుటుంబానికి ప్రభుత్వం మూడు సెంట్ల ప్రభుత్వ స్థలం కేటాయించి ఇంటిని నిర్మించి ఇవ్వాలంటూ వారు డిమాండ్ చేశారు. అలాగే చికిత్స పొందుతున్న రమణ కుటుంబానికి సైతం ప్రభుత్వం ఆర్థికసహాయం అందించాలన్నారు. ప్రభుత్వ యంత్రాంగం కఠిన చర్యలు తీసుకోవడం ద్వారా మరోమారు ఇలాంటి సంఘటనలు జరుగకుండా చూడాలంటూ వారు కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు కోటేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్, కార్యదర్శి మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు మేజర్ పంచాయతీలోని న్యూక్రిష్ణానగర్‌లో గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్డుపై డ్రైనేజీ నీరు నిలిచి పాదచారులు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. డ్రైనేజీ కాలువ పూర్తిగా దెబ్బతినడంతో వర్షపు నీరు మురికి నీరు కలిసి రోడ్డుపై కుంటలా నిలిచిపోయింది. నిలబడిన నీరు ఎటూ వెళ్లకుండా అక్కడే కొద్దిరోజులకు మురికి కూపంలా తయారైంది. దీని వల్ల దోమలు అధికమై జ్వరాలు వచ్చే ప్రమాదం ఉందని, అధికారులు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



రోడ్డుపై మడుగును తలపిస్తున్న వర్షపు నీరు

రాష్ట్రస్థాయిలోనూ రాణించి పేరు నిలబెట్టాలి



జిల్లాస్థాయి పోటీల విజేతలతో డైట్ అధ్యాపకులు

రాయచోటి అర్బన్ : వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన వక్తృత్వ, వ్యాసరచన పోటీలలో జిల్లాస్థాయిలో నిలిచిన విద్యార్థులు రాష్ట్రస్థాయిలోనూ రాణించి రాయచోటి పేరును నిలబెట్టాలని డైట్ ప్రిన్సిపల్ అజయ్ కుమార్ కోరారు. ఆదివారం స్థానిక డైట్ ఆవరణలో నిర్వహించిన ఆయా పోటీల్లో విజేతలకు ఆయన బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారుల హక్కులపై పూర్తిస్థాయి అవగాహన కల్పించేలా జిల్లాస్థాయిలో ఈ పోటీలను నిర్వహించామన్నారు. వ్యాసరచన పోటీలలో తెలుగు మీడియంలో ఎం.శిరీష, ఇంగ్లిషు మీడియంలో లిఖితారెడ్డి, వక్తృత్వ పోటీలలో ఇంగ్లిషు మీడియంలో మహమ్మద్ ఆనస్‌లు విజేతలుగా నిలిచారన్నారు. వీరు రాష్ట్రస్థాయిలో జరిగే పోటీలలో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో డైట్ అధ్యాపకులు అసదుల్లా, శివభాస్కర్, రెడ్డెప్పరెడ్డి, నాగరాజు, నాగేశ్వరరావుతో పాటు పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంపై దృష్టిపెట్టాలి



మాట్లాడుతున్న పీడీఎస్‌యూ నేత ఎం.అంకన్న

రాయచోటి అర్బన్ : జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, గురుకుల, కస్తూర్బా పాఠశాలల్లోని విద్యార్థుల సమస్యలను పరిష్కరించే అంశంపై అధికారులు దృష్టిపెట్టాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమశాఖ వసతి గృహాలలో అవినీతి జరుగుతోందన్నారు. అందులో భాగంగా ఏఎస్‌డబ్ల్యూఓ, వసతి గృహ సంక్షేమాధికారులు స్థానికంగా నివాసం ఉండటం లేదంటూ ఆరోపించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం వడ్డించకుండా బోగస్ హాజరువేస్తూ వసతిగృహ అధికారులు దోచుకుంటున్నారన్నారు. కొందరు వసతిగృహ అధికారులను ఇన్‌చార్జ్‌లుగా నియమించేందుకు ఉన్నతాధికారులకు భారీగా ముడుపులు ముడుతున్నాయని పేర్కొన్నారు. అధికారులు ప్రతినెలా వసతిగృహ సంక్షేమాధికారుల వద్ద మామూళ్లు తీసుకుంటూ జిల్లా అధికారులకు అందజేస్తున్నారంటూ విమర్శించారు. బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం వడ్డించడం లేదన్నారు. పాఠశాలల ప్రిన్సిపల్స్ గతంలో పనిచేసిన డీసీఓ అధికారికి ప్రతినెలా మామూళ్లు ఇస్తున్నట్లు ఆరోపణలున్నాయన్నారు. బాలికల వసతిగృహాల్లో వెంటనే సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. వెంటనే వసతిగృహ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలంటూ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లానేతలు సాయినాయక్, అమీర్, రవీంద్ర, మంజునాథ్‌లు పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



సింగరాజుగారిపల్లి చర్చిలో సెమీ క్రిస్మస్ వేడుకల్లో నాయకులు

లక్కిరెడ్డిపల్లి : మండలంలోని సింగరాజుగారిపల్లి చర్చిలో ఆదివారం రాత్రి ప్రముఖ పారిశ్రామికవేత్త కొండూరు రాజ్‌కుమార్ రాజు ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలో లక్కిరెడ్డిపల్లి ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి, ఏపీఓ మద్దిరేవుల సురేంద్రనాథ్ రెడ్డి, ఉప సర్పంచ్ మద్దిరేవుల సంజీవ్‌రెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు గ్రామస్తులతో కలిసి కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేసి కేక్‌ను పంచిపెట్టారు. అనంతరం చర్చిలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం ప్రార్థనలో పాల్గొన్న వారికి విందును వడ్డించారు. ఈ కార్యక్రమంలో కొండూరు ఏసురాజు, సుదర్శన్ రాజు, సత్యంరాజు, ఏలియా రాజు, నాగేంద్రబాబు, సైమన్, చంద్రహాసన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

'సినీ పరిశ్రమపై కాంగ్రెస్ వైఖరి మారాలి'

రాజంపేట టౌన్ : తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం పరిపాలన చేయడంలో ఘోరంగా విఫలమైందని, ఆ వైఫల్యాన్ని పక్కదారి పట్టించేందుకు ఓయూ జేఏసీ ముసుగులో సినీ హీరో అల్లు అర్జున్ ఇంటిపై కాంగ్రెస్ నాయకులు దాడి చేయించినట్లు బీజేపీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్‌నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. ద్వేషంతోనే తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అల్లు అర్జున్‌పై, సినీ పరిశ్రమపై దాడి చేయిస్తున్నాడని విమర్శించారు. రేవంత్‌రెడ్డి ప్రాంతాల మధ్య వైషమ్యాలు ఏర్పడేలా వ్యవహరిస్తున్నాడని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యం చెందిన ప్రతిసారి ఏదో ఒక సమస్యను ముందుకు తీసుకొచ్చి ప్రజల దృష్టిని మరల్చేందుకు యత్నిస్తున్నారన్నారు. సినీ పరిశ్రమపై సీఎం రేవంత్‌రెడ్డి తన తీరు మార్చుకోకుంటే సినీ పరిశ్రమ ఆంధ్రకు తరలివస్తుందని అభిప్రాయపడ్డారు. తెలంగాణ ఏర్పడి పది సంవత్సరాలైనా కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు వారి రాజకీయ పబ్బం గడుపుకోవడానికి ఆంధ్రప్రదేశ్‌పై ద్వేషాన్ని నూరిపోస్తున్నారని ఆరోపించారు.

తలమానికం ఆర్‌సీఎం చర్చి

క్రిస్మస్ వేడుకలకు ముస్తాబు చేస్తున్న సంఘ పెద్దలు



రామాపురంలోని ఆర్‌సీఎం చర్చి

రామాపురం : మండల కేంద్రంలో ప్రధాన జాతీయ రహదారి వద్ద ఉన్న ఆర్సీఎం చర్చి రామాపురానికే తలమానికమని చెప్పవచ్చు. సుమారు నాలుగు దశాబ్దాల క్రితం సుమారు ఎనిమిది ఎకరాలలో నిర్మాణమైన చర్చి కడప మేత్రాసనం పరిధిలోకి వస్తోంది. వారి ఆజ్ఞమేరకు ఇక్కడ చర్చిలో ప్రతి రోజు ప్రార్థనలు, భక్తిగీతాలు ఆలపిస్తుంటారు. ఆదివారం జరిగే ప్రార్థనలకు పెద్దసంఖ్యలో క్రైస్తవులు, విశ్వాసులు పాల్గొంటారు. చర్చి ఆధ్వర్యంలో ప్రైమరీ స్కూల్‌ను నడిపిస్తున్నారు. పాఠశాలలో పిల్లలకు క్రమశిక్షణతో కూడిన విద్యను బోధిస్తుంటారు. ఏటా డిసెంబర్ నెలలో వచ్చే క్రిస్మస్ పండుగ క్రైస్తవులకు ప్రత్యేకం. ఈ సందర్భంగా చర్చిని విద్యుత్ దీపాలతో రంగురంగుల పేపర్లతో క్రిస్మస్ ట్రీ, కిస్మస్ తాత, స్టార్‌లతో ప్రత్యేకంగా అలంకరించారు. మండలంలోని అన్ని గ్రామాలతోపాటు వీరబల్లి నుంచి కూడా క్రైస్తవ భక్తులు, ప్రజలు ఇక్కడి చర్చిలో ప్రార్థనల్లో పాల్గొంటూ ఉంటారు. క్రిస్మస్ పండుగకు చర్చిలో ప్రత్యేక ఏర్పాట్లు తీసుకుంటున్నట్లు చర్చి ఫాదర్లు (పాస్టర్లు)చిన్నప్ప, సురేష్‌లు పేర్కొన్నారు. ఈ వేడుకలు 23వ తేదీ నుండి జనవరి నెల వరకు నిర్వహిస్తారని తెలిపారు.

నిర్లక్ష్యం వీడి మందలించేనా..!

- రోడ్డుపై సేదతీరుతున్న ఆవులు
- పట్టించుకోని యజమానులు, అధికారులు, పోలీసులు



జాతీయ రహదారి పైనే తిష్టవేసిన ఆవుల మంద

రామాపురం : రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని అవగాహనలు కల్పించే అధికారులు రోడ్డుపై ఆశ్రయించే మూగజీవాలపై ఉదాసీన వైఖరిని అవలంభిస్తున్నారు. కర్నూలు – చిత్తూరు జాతీయ రహదారిలోని రామాపురం మండలం గువ్వలచెరువు వద్ద మూగజీవాలు రహదారిని ఆశ్రయిస్తుండటంతో వాహనదారులకు ఇబ్బందిగా మారిందని వాహనదారులు, గ్రామ ప్రజలు ఆరోపిస్తున్నారు. ఏడాది కాలంగా రహదారి పైకి మూగజీవాలు వస్తున్నా, యజమానులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. దీంతో వాహనాల యజమానులు, స్కూటరిస్టులు, ప్రయాణికులు ఇబ్బందులకు గురై ప్రమాదాలు జరిగిన సంఘటనలు చాలానే ఉన్నాయి. రాత్రి సమయంలో మూగజీవాలు రోడ్డుకు అడ్డంగా భైఠాయించడం, నిద్రించడంతో వాహనదారులు గమనించకపోవడంతో మూగజీవాలకు గాయాలైన సంఘటనలూ ఉన్నాయని ప్రయాణికులు, వాహనదానులు ఆరోపిస్తున్నారు. పలుమార్లు పరిస్థితిని తెలియజేసినప్పటికీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ఏదైనా పెద్ద ప్రమాదం జరిగితే తప్పా పట్టించుకోరా అని పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు జాతీయ రహదారిలో రాకపోకలకు అంతరాయం కలిగిస్తున్నా మూగజీవాలను సంబంధిత యజమానులకు అప్పగించడం లేదా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని వాహనదారులు, గ్రామస్తులు కోరుతున్నారు.

సత్తాచాటిన కానిస్టేబుల్ వర్మ



చెక్కును అందుకుంటున్న రాఘవేంద్ర వర్మ

నందలూరు : సౌత్ ఇండియా షటిల్ బ్యాడ్మింటన్ టోర్నీలో నందలూరు పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న రాఘవేంద్ర వర్మ విజేతగా నిలిచాడు. ఆదివారం విజయవాడలోని ఎస్ఎల్‌వీ అమరావతి గ్రాండ్ ఇండోర్ స్టేడియంలో ఈ పోటీలు జరిగాయి. టోర్నీలో డబుల్స్ విభాగంలో తునికి చెందిన అనిల్‌తో కలసి రాఘవేంద్ర వర్మ పాల్గొన్నాడు. అనంతరం టీడీపీ సీనియర్ నాయకులు అశోక్ గజపతిరాజు, నిర్వాహకులు ట్రోఫీని చెక్కును విజేతకు అందజేశారు. పలువురు నందలూరు క్రీడాకారులు వర్మను అభినందించారు.

చల్లగా చూడమ్మా.. రెడ్డెమ్మ

గుర్రంకొండ : 'రెడ్డెమ్మ తల్లీ చల్లగా చూడమ్మా' అంటూ భక్తులు వేడుకొన్నారు. ఆదివారం చెర్లోపల్లె గ్రామంలోని శ్రీ రెడ్డెమ్మతల్లి ఆలయం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే పలు రకాల నైవేద్యాలు సమర్పించి విశేషమైన పూజలు, అభిషేకాలు చేశారు. సంతానం కోసం మహిళలు వరపడ్డారు. సంతానం కలిగిన భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకొన్నారు. అమ్మవారికి భక్తిశ్రద్ధలతో తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

భక్తులతో అమ్మవారి ఆలయాలు కిటకిట



సంబేపల్లె: భక్తులకు దర్శనమిస్తున్న నల్లగంగమ్మ



లక్కిరెడ్డిపల్లె: ప్రత్యేక అలంకారంలో గంగమ్మ

సంబేపల్లె : మండల కేంద్రంలోని శ్రీ దేవరరాయి నల్లగంగమ్మ ఆలయంలో ఆదివారం అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా వేపాకులతో ఆలయ ప్రాంగణమంతా శుద్ధి చేశారు. అర్చకలు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చకులు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం మొక్కులు ఉన్న భక్తులు అమ్మవారికి బలి అర్పించి, బంధుమిత్రులతో కలసి ఆలయ ప్రాంగణంలో విందును ఆరగించారు.

అనంతపురం గంగమ్మ ఆలయంలో..

లక్కిరెడ్డిపల్లి : ప్రజలందరూ సుభిక్షంగా ఉండేలా చూడాలంటూ అనంతపురం గంగమ్మకు భక్తులు పూజలు చేశారు. ఆదివారం అమ్మవారి దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. క్యూలైన్ ద్వార భక్తులు అమ్మవారి దర్శించుకున్నారు. అంతకుముందు ఆలయ అర్చకులు చెల్లు వంశీయులు అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపి విశేషంగా అలంకరించారు.

పీవీ రావు ఆశయాల అమలుకు కృషి

కడప కార్పొరేషన్ : మాల ఉద్యమ నేత మాల మహానాడు వ్యవస్థాపకులు పీవీ రావు ఆశయాలను అమలు చేసేందుకు కృషి చేస్తామని మాల మహానాడు సంఘం గౌరవ సలహాదారు అయితబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఉబ్బరపు సురేష్ పేర్కొన్నారు. స్థానిక కార్యాలయంలో పీవీ.రావు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోరుతున్న వారి స్వార్థ రాజకీయాలను ధైర్యంగా ఎదుర్కొన్న ధీశాలి పీవీ.రావు అని కొనియాడారు. జాతి ప్రయోజనాల కోసం ఆఖరి నిముషం వరకూ శ్రమించారని, ఆయన ఆశయాలను కొనసాగించాల్సిన బాధ్యత అందరిపై ఉందని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ఎద్దుల వసంతకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

కడప ఎడ్యుకేషన్ : కడప జిల్లాలో ఓపెన్ పాఠశాల తరగతులు నిర్వహించకపోయినా, ఫీజులు వసూలు చేసుకుంటూ అక్రమాలకు పాల్పడుతున్నారని అఖిల భారత విద్యార్థి బ్లాక్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయవర్ధన్ ఆరోపించారు. కడప కాగితాలపెంటలోని ఏఐఎస్‌బీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో ఆదివారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో దాదాపు 7 వేల మందికి పైగా ఓపెన్ విద్యకు దరఖాస్తు చేసుకున్నారన్నారు.

జిల్లాలో కొన్ని చోట్ల తరగతులు నిర్వహించకుండా, పరీక్షల సమయంలో మాత్రమే హాల్‌టికెట్ జారీ చేసి అభ్యర్థుల నుంచి వేలాది రూపాయలు ఫీజు వసూలు చేస్తున్నారని వాపోయారు. జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, కమలాపురం, కడప, మైదుకూరు ప్రాంతాల్లో ఓపెన్ విద్యను ఒక వ్యాపారంగా మలుచుకొని లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్నారన్నారు. కొన్ని చోట్ల పరీక్ష సమయంలో విద్యార్థులను పాస్ చేయిస్తామని చెప్పి అదనపు ఫీజు వసూలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ సగిలి రాజేంద్ర ప్రసాద్, డేవిడ్ పాల్గొన్నారు.